# 'పోరాటానికి సిద్ధం కావాలి'



సమావేశమైన ఎమ్మార్పీఎస్ నాయకులు

బాన్సువాడ, డిసెంబర్ 15: సుప్రీంకోర్టు తీర్పు ప్రకారంగా ఎస్సీ వర్గీకరణ అమలు కోసం మాదిగలు, ఉపకులాలు మరో పోరాటానికి సిద్ధం కావాలని ఎమ్మార్పీఎస్ కామారెడ్డి జిల్లా పర్యావేక్షకుడు మంథని సామ్యూల్ మాదిగ అన్నారు. బాన్సువాడ నియోజకవరగ కేంద్రంలోని ఆర్అండ్‌బీ అతిథి గృహంలో ఆదివారం నిర్వహించిన ఎమ్మార్పీఎస్ నాయకుల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సమావేశంలో గరుగళ్ల బాలరాజ్, డాకయ్య, ఎర్రవట్టి పోశిరాం, కోటగిరి సతీశ్, బోర్లం రమేశ్, దొబ్బల గంగాధర్, బంగారు రవి, మెక్కా సాయి తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

వినాయక్‌నగర్, డిసెంబర్15: నిజామాబాద్ నగరంలోని కంఠేశ్వర్ బైపాస్ రోడ్డు ఏరియాలో నడుచుకుంటూ వెళ్తున్న ఓ వ్యక్తిని ద్విచక్ర వాహనదారుడు ఢీ కొట్టడంతో సదరు వ్యక్తి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల కథనం మేరకు.. నగరంలోని హనుమాన్ నగర్‌కు చెందిన వేముల రాసోటి అనే వ్యక్తి ఆదివారం కంఠేశ్వర్ బైపాస్ ఏరియాలోని రోకడ హనుమాన్ ఆలయం వద్ద నుంచి నడుచుకుంటూ వెళ్తున్నాడు. వెనక నుంచి అతివేగంగా వచ్చిన బైక్ అతనిని ఢీ కొట్టింది. దీం తో రాసోటి కింద పడిపోగా తలకు బలమై గాయమైంది. స్థానికులు చికిత్స నిమిత్తం ప్రభుత్వ దవాఖానకు తరలించారు. ఈ ప్ర మాదంపై పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయనున్నట్లు క్షతగాత్రుడి కుటుంబీకులు తెలిపారు.

# యువకుడిపై పోక్సో కేసు నమోదు

రెంజల్, డిసెంబర్ 15 : మండలంలోని ఓ గ్రామంలో మైనర్ బాలికపై అసభ్యకరంగా ప్రవర్తించిన యువకుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు రెంజల్ ఎస్సై ఈ సాయన్న ఆదివారం తెలిపారు. మహారాష్ట్రలోని ధర్మాబాద్ పట్టణానికి చెందిన మహ్మద్‌షఫీ అనే యువకుడు శనివారం కూరగాయల సంతలో మైనర్ బాలికపై అసభ్యకరంగా ప్రవర్తించాడన్న ఫి ర్యాదు మేరకు విచారణ చేపట్టి పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినట్లు తెలిపారు. సదరు యువకుడిని రిమాండ్‌కు పంపినట్లు ఎస్సై పేర్కొన్నారు.

# టేకు దుంగలు స్వాధీనం

ఎల్లారెడ్డి రూరల్, డిసెంబర్ 15: మండలంలోని వెల్లుట్ల గ్రామంలో ఇంట్లో నిల్వ ఉంచిన టేకు దుంగలను అటవీశాఖ అధికారులు పక్కా సమాచారం మేరకు శనివారం రాత్రి పట్టుకున్నారు. ఫారెస్ట్ డివిజనల్ ఆఫీసర్ రామకృష్ణ తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. వెల్లుట్ల గ్రామానికి చెందిన పైడాకుల నర్సింహులు ఇంట్లో అనుమతి లేకుండా టేకు దుంగలు నిల్వ ఉంచినట్లు ఫారెస్ట్ అధికారులకు సమాచారం అందింది. దీంతో సిబ్బంది గ్రామానికి వెళ్లి అతడి ఇంట్లో తనిఖీ చేపట్టారు. 27కోయని, 97 కోసిన టేకు దుంగలు లభించాయి. ఎలాంటి అనుమతి పత్రాలు లేకపోవడంతో వాటిని స్వాధీనం చేసుకొని, ఎల్లారెడ్డి అటవీశాఖ కార్యాలయానికి తరలించారు. నర్సింహులుపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎఫ్‌డీవో రామకృష్ణ తెలిపారు.

# వివిధ కారణాలతో ఐదుగురి మృతి

నవీపేట, డిసెంబర్ 15: అప్పుల బాధ భరించలేక గల్ఫ్ వెళ్లి అప్పులు తీర్చుదామని అనుకున్న గల్ఫ్ బాధితుడు చివరికి జీవితం మీద విరక్తి చెంది ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని మట్టయ్యఫారం లో ఆదివారం చోటు చేసుకున్నది. ఎస్సై వినయ్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని మట్టయ్యఫారం గ్రామానికి చెందిన కేతావత్ పీర్‌సింగ్(35) ఎనిమిదేళ్ల క్రితం బతుకు దెరువు కోసం దుబాయ్ వెళ్లాడు. అక్కడ సరైన పని దొరక్క ఐదేండ్ల క్రితం స్వగ్రామం తిరిగి వచ్చాడు. దుబాయ్ వెళ్లేందుకు చేసిన అప్పులు తీరకపోవడంతో మళ్లీ గల్ఫ్‌కు వెళ్లి డబ్బులు సంపాదించి అప్పులు తీరుద్దామని తిరిగి అప్పులు అడిగినా ఎవరూ ఇచ్చేందుకు ముందుకు రాలేదు. దీంతో అప్పుదొరక్క అప్పులు తీర్చే మార్గం తెలియక జీవితం మీద విరక్తి చెంది శనివారం తన ఇంటి వద్దనే పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. చావు బతుల్లో ఉన్న ఫీర్‌సింగ్‌ను చికిత్స నిమిత్తం జిల్లా ప్రభుత్వ దవాఖానకు తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మరణించాడు. మృతుడు ఫీర్‌సింగ్‌కు భార్య కళావతి, ఇద్దరు పిల్లలు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు శవాన్ని పంచనామ చేసి పోస్టు మార్టం అనంతరం బంధువులకు అప్పజెప్పి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వినయ్ పేర్కొన్నారు.

**రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి..**

బాల్కొండ, డిసెంబర్ 15: బాల్కొండ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా మరొకరు గాయపడ్డారు. ఎస్సై నరేశ్ తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి.. నిర్మల్‌కు చెందిన ఎండీ అద్నాన్ తన స్నేహితుడు షేక్ ఫైసల్‌తో కలిసి బిజినెస్ పని మీద బైక్‌పై నిజామాబాద్‌కు వస్తుండగా మధ్యాహ్నం రెండు గంటల ప్రాంతం లో44వ నెంబర్ జాతీయ రహదారిపై చిట్టాపూర్ గ్రామ శివారులో గుర్తు తెలియని డీసీఎం వాహనం బైక్‌ను ఢీకొంది. దీంతో ఇద్దరికి గాయాలు కాగా వీరిని చికిత్స నిమిత్తం ఆర్మూర్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. తీవ్ర గాయాలైన అద్నాన్ చికిత్స పొందుతూ మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



రోడ్డు ప్రమాదంలో గాయపడిన అద్నాన్

**ప్రమాదవశాత్తు కాలువలో పడి ఒకరి మృతి..**

ఆర్మూర్‌టౌన్, డిసెంబర్ 15 : ఆర్మూర్ పట్టణంలోని పెర్కిట్ సోనాజీ అలియాస్ గాంధీ శామల్‌వాడ్(60) ప్రమాదవశాత్తు కాలువలో పడి మృతి చెందిన ఘటన ఆదివారం వెలుగు చూసింది. ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా షిబ్దారా గ్రామానికి చెందిన సోనాజీ పెర్కిట్‌లో కూలీపని చేస్తూ కుటుంబంతో జీవిస్తున్నాడు. కాగా శనివారం సా యంత్రం పెర్కిట్‌లోని మట్టు కాలువలో చేపలు పడుతుండగా కాలువలో పడి మృతి చెందాడు. మృతదేహం ఆదివారం లభ్యమైంది. పోస్టు మార్టం నిమిత్తం ప్రభుత్వ దవాఖానకు తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

**చెరువులో చేపలు పట్టడానికి వెళ్లిన జాలారి గుండెపోటుతో మృతి..**

నవీపేట, డిసెంబర్ 15: చెరువులో చేపలు పట్టడానికి వెళ్లిన ఓ జాలరి తెప్పపైనే గుండె పోటుతో ఆదివారం నేలకు ఒరిగాడు. ఏఎస్సై మోహన్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. నవీపేట మండలం బినోలా గ్రామానికి చెందిన ఎర్రోల్ల మోహన్ గ్రామానికి చెందిన మరో ఇద్దరు జాలరులు గూండ్ల సాయిలు, భూమయ్యతో కలిసి గ్రామ పెద్ద చెరువులో చేపలు పట్టేందుకు వెళ్లాడు. చెరువులో చేపలు పట్టేందుకు వల వేశాడు. అంతలోనే మోహన్ తెప్ప పైనే పడిపోయాడు. వెంటనే తోటి జాలర్లు తేరుకొని తెప్ప పైనే పడి ఉన్న మోహన్‌ను హుటా హుటిన 108 అంబులెన్స్‌లో దవాఖానకు తీసుకు వెళుతుండగా మార్గ మాధ్యలోనే మృతి చెందాడు. మృతుడు మోహన్‌కు కుమారుడు, ఇద్దరు కూతుర్లు, భార్య పద్మ ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు శవాన్ని పంచనామ చేసి పోస్టు మార్టం అనంతరం కుటంబ సభ్యులకు అప్పజెప్పి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై పేర్కొన్నారు.

### ఇద్దరు యువకుల మధ్య ఘర్షణ.. ఒకరు మృతి ..

వినాయక్‌నగర్, డిసెంబర్ 15: జిల్లా కేంద్రంలోని గంజ్ ప్రాంతంలో ఆదివారం రాత్రి ఇద్దరు యువకుల మధ్య చోటుచేసుకున్న ఘర్షణలో ఓ యువకుడు మృతి చెందాడు. నగరంలోని మిర్చి కాంపౌండ్ ప్రాంతానికి చెందిన చంద్రకాంత్(22) అనే యువకుడు రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న క్రమంలో మరో యువకుడితో గొడవ మొదలైంది. వారి మధ్య మాటామాట పెరిగి పరస్పరం దాడులు చేసుకున్నారు. ఈ క్రమంలో మురుగు కాల్వలో పడడంతో చంద్రకాంత్ తలకు బలమైన గాయాలు అయ్యాయి. దీంతో యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. దాడికి పాల్పడిన యువకుడు అక్కడి నుంచి పారిపోయాడు. వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో రఘుపతి సంఘటన స్థలానికి చేరుకొని స్థానికులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ దవాఖానకు తరలించారు. దాడికి పాల్పడిన నిందితుడి కోసం గాలింపు నిర్వహిస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

# ప్రారంభానికి నోచుకోని జీపీ భవనం

- బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నిర్మాణం





స్టేషన్ ఏరియాలో ప్రారంభానికి నోచుకోని నూతన జీపీ భవనం

నవీపేట, డిసెంబర్15:మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన జీపీ భవనం ప్రారంభానికి నోచుకోవడం లేదు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రూ.14 లక్షల వ్యయంతో ఈ భవనాన్ని నిర్మించారు. ఈ ఎడాది ఫిబ్రవరి 2న పనులు పూర్తయ్యాయి. స్టేషన్ ఏరియా జీపీ కార్యాలయం పాత ప్రభుత్వ దవాఖాన పెంకుటింట్లో కొనసాగుతోంది. జీపీకి పక్కా భవనం లేక పోవడంతో వివిధ పనుల కోసం వచ్చే ప్రజలు ఇబ్బందులకు గరవుతున్నారు. భవనం ప్రారంభానికి సంబంధించి ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి కి సమాచారం ఇచ్చినట్లు అధికారులు పేర్కొంటున్నారు. కాగా సర్పంచుల ఎన్నికలు పూర్తనయిన తర్వాత నూతన జీపీ పాలక వర్గం ఏర్పడిన తర్వాత జీపీ భవనాన్ని ప్రారంభించాలనే ఉద్దేశంతో స్థానిక కాంగ్రెస్ నాయకులు భవన ప్రారంభాన్ని ఆపుతున్నట్లు స్థానికుల ద్వారా తెలిసింది.

## ఆరోగ్యం బాగాలేక ఉరేసుకుని యువతి ఆత్యహత్య

లింగంపేట(తాడ్వాయి), డిసెంబర్15: తాడ్వా యి మండలంలోని చిట్యాల గ్రామానికి చెందిన ఏర్పుల మంజుల (26) ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నదని ఎస్సై వెంకటేశ్వర్లు ఆదివారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. కామారెడ్డి పట్టణంలోని ప్రైవేటు దవాఖానలో నర్సుగా పని చేస్తున్న మంజుల కొంత కాలంగా పంటి, కడుపు నొప్పితో బాధపడుతున్నది. చికిత్స చేయించుకున్నా సమస్యలు తగ్గలేదు. దీంతో శనివారం కుటుంబ సభ్యులు వ్యవసాయ పనులకు వెళ్లగా.. మంజుల ఇంట్లో దూలానికి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నది. కుటుంబ సభ్యులు సాయంత్రం ఇంటికి వచ్చి గమనించి, పోలీసులకు సమాచారం అందించారు. మృతురాలి తండ్రి కాశయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి ప్రభుత్వ దవాఖానకు తరలించామన్నారు.

## అనారోగ్యంతో రైతు..

రామారెడ్డి, డిసెంబర్ 15: అనారోగ్యంతో రైతు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలో ఆదివారం చోటుచేసుకున్నది. రామారెడ్డి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కన్నాపూర్ గ్రామానికి చెందిన పురిమిశెట్టి స్వామి(38) కొన్ని రోజుల క్రితం అనారోగ్యంతో బాధపడుతున్నాడు. దీంతో మనస్తాపం చెందిన అతడు.. సొంత వ్యవసాయ భూమిలో చెట్టుకు ఉరేసుకొని ఆదివారం ఆత్మహత్య చేసుకున్నాడు. భార్య వరలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై నరేశ్ తెలిపారు.

## మతిస్థిమితం లేని మహిళ మృతి

నిజాంసాగర్, డిసెంబర్ 15: నిజాంసాగర్ పోలిస్‌స్టేషన్ పరిధిలోని బంజపల్లి గ్రామంలో మతిస్థిమితం లేని ఒక మహిళ మృతి చెందిన ఘటన ఆదివారం చోటు చేసుకున్నది.ఎస్సై శివకుమార్, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. బంజపల్లి గ్రామానికి చెందిన కుర్మ భూమవ్వ(70) డిసెంబర్ 10వ తేదీన ఇంట్లో నుంచి వెళ్లింది. కుటుంబ సభ్యులు వెతికినా.. ఆచూకీ లభించలేదు. బంజపల్లి శివారులోని పెద్దపూల్ రోడ్డు పక్కన ఆదివారం ఆమె మృతదేహం కనిపించింది. కాలకృత్యాలు తీర్చుకోవడానికి వెళ్లి.. ప్రమాదవశాత్తు పడి మృతి చెంది ఉంటుందని కుటుంబీకులు తెలిపారు. మృతురాలి కొడుకు సాయిలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

## తల్లీకూతురు అదృశ్యం

కామారెడ్డి, డిసెంబర్ 15: తల్లీకూతురు అదృశ్యమైన ఘటన కామారెడ్డి పట్టణంలో చోటుచేసుకున్నది. పట్టణ సీఐ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని భవానీరోడ్‌లో నివసించే చాట్ల స్వరూపకు ఆరేండ్ల క్రితం వివాహం కాగా ఒక కుమార్తె ఉన్నది. భార్యాభర్తల మధ్య గొడవ జరిగింది. దీంతో ఆమె తల్లిదండ్రులతో కలిసి ఉంటున్నది. ఈనెల 4వ తేదీన స్వరూప తన నాలుగేండ్ల కూతురుతో కలిసి ఇంట్లో నుంచి వెళ్లింది. కుటుంబీకులు వెతికినా.. ఆచూకీ లభించలేదు. దీంతో స్వరూప తల్లి సిద్ధవ్వ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు కామారెడ్డి పట్టణ పోలీస్‌స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని సూచించారు.

## రాబడి

# పిల్లల్లో ఆర్థిక క్రమశిక్షణ ఎలా?

## చిన్నచిన్నగా పొదుపు పాఠాలు నేర్పండిలా..

*ఈ రోజుల్లో పిల్లలు చాలా చాలా చురుగ్గా ఉంటున్నారు.*

*హింటిస్తే చాలు అల్లుకు పోతున్నారు. ప్రతీ విషయంలో తెలివిగా ఆలోచించి నేర్చుకుంటున్నారు.*

***తల్లిదండ్రులు కాస్త ఓపిగ్గా చెబితే ఆర్థిక క్రమశిక్షణ కూడా అలవాటవుతుంది. మరి పసితనంలోనే పొదుపు పాఠాలు నేర్పుతారా! నిపుణుల సలహాలేమిటి?***



**ప్రతీ** మనిషి తన జీవితంలో ఉన్నత లక్ష్యాలను సాధించాలంటే ఆర్థిక క్రమశిక్షణ కూడా అవసరం. అది చిన్నతనం నుంచే అలవర్చుకుంటే మెరుగైన ఫలితాలను పొందవచ్చు. నిజానికి ఇది ఒకప్పటితో పోల్చితే ఇప్పటి తరాలకు నేర్పడం సులభమనే చెప్పవచ్చు. టెక్నాలజీపరంగా కూడా నేటి పిల్లలు ఎంతో ముందుంటున్నారు. వారికి నచ్చినవిధంగా మనం చెప్పగలిగితే వారి నుంచి అద్భుతాలనే ఆశించవచ్చంటే ఎంతమాత్రం అతిశయోక్తి కాదు. కానీ మెజారిటీ తల్లిదండ్రులు తమ పిల్లలు.. ఆటలు, చదువు, ఇతరత్రా రంగాల్లోనే రాటుదేలాలని చూస్తున్నారు. అందుకు తగ్గట్టుగానే శిక్షణను కూడా ఇప్పిస్తున్నారు. అయితే ఇవన్నీ అవసరమైనవే అయినా.. మనీ మేనేజ్‌మెంట్ కూడా చాలాచాలా ముఖ్యమని ఆర్థిక నిపుణులు చెప్తున్నారు. వివేకవంతమైన నిర్ణయాల్లో ఆర్థిక క్రమశిక్షణ కీలకపాత్ర పోషిస్తుందని గుర్తు చేస్తున్నారు. అందుకే ఈ విధంగా ముందుకెళ్లాలంటూ సూచిస్తున్నారు.

### పొదుపు

తల్లిదండ్రులు తమ పిల్లలకు పొదుపు విలువను తెలియజేస్తూ పెంచాలి. అప్పుడే బాధ్యతలనేవి తెలిసొస్తాయి. ప్రతి నెలా పిల్లలకు రూ.10 లేదా రూ.20 ఇస్తూ వెళ్లండి. ఇచ్చేటప్పుడే ఆ డబ్బును దాచుకుంటే రేపు వాళ్ల అవసరాలను దానితో ఎలా తీర్చుకోవచ్చో వివరించండి. ఒకవేళ మీకు అవసరమైతే ఆ నగదును అడిగి తీసుకుని, మళ్లీ తిరిగిచ్చేటప్పుడు అదనంగా ఇంకాస్త ఇవ్వండి. దీంతో సంపాదన అంటే ఏంటో కూడా తెలుస్తుంది. ఇలా ఒక ఏడాదిపాటు ఆ పైసలను ఖర్చు చేయకుండా దాచుకోవాలని చెప్పి, అందుకు మద్దతుగా నిలవండి. అప్పుడు ఒక్కసారిగా పోగయ్యే ఆ సొమ్ముతో వారికి అవసరమైనవి కొనివ్వండి. ఇలా మీరే కాదు.. ఇంట్లోని పెద్దవాళ్లు ఎవరిచ్చినా అలాగే దాచుకునేలా అలవాటు చేస్తే మంచి ఫలితాల్నే చూడవచ్చు.

### ఖర్చులు

ఆర్థిక క్రమశిక్షణలో పొదుపు ఎలాంటి పాత్ర పోషిస్తుందో.. ఖర్చులూ అలాంటి భూమికనే వహిస్తాయి. అందుకే అవసరాలు, కోరికల మధ్య వ్యత్యాసాన్ని పిల్లలకు తెలియజేయాలి. ఏది అవసరమో, ఏది అనవసరమో తెలియజెప్పాలి. వినకపోతే నచ్చజెప్పాలేగానీ.. తిట్టి, కొట్టి వారిని దారికి తెచ్చుకోవాలనుకుంటే మాత్రం మొదటికే మోసం వస్తుందన్నది మరువద్దు. ఎందుకంటే ఇలాచేస్తే పిల్లలు మొండిగా తయారవుతారు. ఆహారం, పుస్తకాలు అవసరమైనవని.. బొమ్మలు, చిరుతిళ్లు అనవసరమైనవని చెప్పాలి. ఉదాహరణకు ఒక వెయ్యి రూపాయలతో ఓ గేమ్‌ను లేదా స్కూల్ షూస్ కొనవచ్చని చెప్పి, దేనికెంత ప్రాధాన్యమో తెలియపర్చండి. అనవసరంగా, వృథాగా ఖర్చుచేస్తే ఎదురయ్యే పరిణామాలను ప్రాక్టికల్‌గా తెలియజేయండి. చెబితే విన్న దాని కంటే చూస్తే నేర్చుకునేదే ఎక్కువ మరి. కనుక ఇంటి ఆర్థిక విషయాల్లో వీలున్నంత మేరకు మీ పిల్లలని భాగస్వాముల్ని చేయండి.

### లక్ష్యాలు

ఆర్థిక లక్ష్యాలు అనేవి చాలా కీలకం. పిల్లలు కోరిన ఓ బొమ్మ కోసమో లేదా మరే ఇతర వస్తువుకైనాసరే దానికయ్యే నగదును ఎలా దాచుకోవాలి, సంపాదించాలన్నదాని కోసం ఓ లక్ష్యాన్ని నిర్దేశించాలి. ఈ లక్ష్య సాధనకు వారి వెన్నంటే ఉంటూ ప్రోత్సహించాలి. ఉదాహరణకు వారికి రూ.1,500 కావాలంటే నెలకు రూ.150 చొప్పున సేవ్ చేసుకునేలా ముందుకు తీసుకెళ్లండి. 10 నెలల్లో రూ.1,500 అందేలా చేస్తే ఆ డబ్బు విలువ, కష్టం, సమయం విలువ కూడా తెలుస్తుంది. పిల్లలో సహనం, ఓపిక పెంపొందించడానికీ ఇది దోహదం చేస్తుంది.

### పెట్టుబడి

పిల్లలకు చిన్నప్పట్నుంచే పెట్టుబడి ప్రాధాన్యతను, దానికున్న అవకాశాలనూ తెలియపర్చాలి. సేవింగ్స్ అకౌంట్స్ లేదా సిస్టమ్యాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్లు (సిప్) మొదలుపెట్టేలా కృషి చేయాలి. సిప్‌లో నెలకు రూ.500 చొప్పున వారు ఇన్వెస్ట్ చేసేలా సహకరించండి. అలా పెడుతూపోయిన నగదు ఏ రకంగా పెరుగుతుందో కూడా వారికి చూపిస్తూ వివరించండి. ఇలా వారిని ఇన్వెస్ట్‌మెంట్ వైపు నడిపిస్తే ప్రతీ రూపాయిని వారు మిగుల్చుకుని, దాన్ని సేవింగ్స్‌లోకి, అలా పెట్టుబడి సాధనాల్లోకి తీసుకెళ్లగలరు.

### రిస్కులు-బీమా

జీవితంలో ఊహించని పరిణామాలెన్నో జరుగుతాయి. అందుకే వాటి గురించి కూడా పిల్లలకు చెప్పాలి. ఆస్తుల ధ్వంసం, దొంగతనాలు, ఉద్యోగం కోల్పోవడం వంటివి ఎదురైతే ఏ రకమైన ఆర్థిక ఇబ్బందులు తలెత్తుతాయో వివరించాలి. అందుకే ముందు జాగ్రత్తగా ఎమర్జెన్సీ ఫండ్లను ఏర్పాటు చేసుకోవాలని సూచించాలి. అలాగే బీమా ఆవశ్యకతను వివరించాలి. ఆర్థిక ప్రణాళికలో బీమా సైతం ప్రధానమేనని తెలియజెప్పడం ముఖ్యం. జీవిత బీమా, ఆరోగ్య బీమా, ప్రమాద బీమా ఇలా దేనికదే ముఖ్యమైనది మరి. దేన్నీ నిర్లక్ష్యం చేయకూడదు.

### చివరగా..

పిల్లలు తల్లిదండ్రులను చూస్తూ పెరుగుతారు. కాబట్టి మీరు ఆర్థిక క్రమశిక్షణతో ఉంటేనే మీ పిల్లలు కూడా అదే బాటలో నడుస్తారన్నది గుర్తుంచుకోవాలి. మీ పొదుపు, మీ పెట్టుబడులు, మీ ఖర్చులన్నీ వారికి తెలిసేలా చేయండి. దీనివల్ల పారదర్శకత కూడా వస్తుంది. సేవింగ్స్, ఇన్వెస్ట్‌మెంట్స్ ఎంత త్వరగా ప్రారంభిస్తే, ఎంత చిన్న వయసు నుంచే ఆరంభిస్తే అంత లాభాలు ఉంటాయన్నది మరువద్దు.

# యూపీఐపై క్రెడిట్ లైన్

## ఎలా వాడుకోవాలో తెలుసా?

**రిజర్వ్** బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ).. తమ తాజా ద్వైమాసిక ద్రవ్యపరపతి విధాన సమీక్షలో యూనిఫైడ్ పేమెంట్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ)పై కస్టమర్లకు 'ప్రీ-శాంక్షన్డ్ క్రెడిట్ లైన్' సౌకర్యాన్ని కల్పించేందుకు స్మాల్ ఫైనాన్స్ బ్యాంకులకూ అనుమతిచ్చింది. నిజానికి గత ఏడాది సెప్టెంబర్‌లోనే యూపీఐపై క్రెడిట్ లైన్ సదుపాయం మొదలైంది. అయితే ఇప్పటిదాకా షెడ్యూల్డ్ కమర్షియల్ బ్యాంకుల్లోనే ఆ సేవలు అందుబాటులో ఉన్నాయి. కానీ ఇప్పుడు చిన్నతరహా బ్యాంకులైన స్మాల్ ఫైనాన్స్ బ్యాంకులకూ ఆర్బీఐ ఈ వీలు కల్పించింది. ఈ నిర్ణయం యూపీఐ యూజర్లకు మరింత కలిసి రానున్నది. త్వరలోనే ఇందుకు సంబంధించి స్మాల్ ఫైనాన్స్ బ్యాంకులకు విధివిధానాలను ఆర్బీఐ ప్రకటించనున్నది. కాగా, అసలు ఈ యూపీఐపై 'ప్రీ-శాంక్షన్డ్ క్రెడిట్ లైన్' అంటే ఏమిటి? ఎలా ఈ సౌకర్యాన్ని రుణగ్రహీతలు పొందవచ్చో తెలుసుకుందాం.

### ఇదీ సంగతి..


నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) వివరాల ప్రకారం 'ప్రీ-శాంక్షన్డ్ క్రెడిట్ లైన్ ఆన్ యూపీఐ' అనేది ఆర్బీఐ విజన్‌కు అనుగుణంగా అభివృద్ధిపర్చిన ఓ సరికొత్త ఆర్థిక వెసులుబాటు. దీనిద్వారా బ్యాంకుల నుంచి వ్యక్తులు, వ్యాపారులు తక్షణ రుణాలను పొందవచ్చు. యూపీఐ ద్వారా లావాదేవీల కోసం ఈ రుణాలను వెంటనే వినియోగించుకోవచ్చు. అయితే యూపీఐ యాప్స్ ద్వారా క్రెడిట్ లైన్ సౌకర్యాన్ని వినియోగించుకోవాలనుకుంటే ముందుగా మీకు సేవింగ్స్ ఖాతా (యూపీఐ యాప్స్‌కు లింకై ఉన్న సేవింగ్స్ అకౌంట్) గల బ్యాంక్ నుంచి ఆమోదం పొందాలి. ఇందుకోసం ఓ అప్లికేషన్‌ను బ్యాంక్‌లో సమర్పించాలి. అప్పుడు బ్యాంక్ మీ అర్హత, ఆదాయం, క్రెడిట్ స్కోర్, రుణ చరిత్రను పరిశీలిస్తుంది. ఈ క్రమంలో ఆదాయం, గుర్తింపు, చిరునామా, ఇతరత్రా అవసరమైన డాక్యుమెంట్లను బ్యాంక్‌కు సమర్పించాల్సి ఉంటుంది. అన్నింటినీ పరిశీలించిన తర్వాత బ్యాంక్ ఆమోదిస్తే మీకు క్రెడిట్ లైన్ సౌకర్యం లభిస్తుంది. అవసరం ఉన్నప్పుడు దీన్ని ఉపయోగించుకోవచ్చు.

### ఎలా లింక్ చేసుకోవాలి?

ఎన్‌పీసీఐ వెబ్‌సైట్ ప్రకారం తొలుత గూగుల్ ప్లే స్టోర్ నుంచి యూపీఐ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి. ఒకవేళ మీ స్మార్ట్‌ఫోన్‌లో ఇప్పటికే ఫోన్‌పే, గూగుల్ పే, పేటీఎం తదితర యూపీఐ యాప్‌లు ఉన్నట్టైతే మళ్లీ ఏ డౌన్‌లోడ్‌లూ అవసరం లేదు. ఉదాహరణకు ఫోన్‌పేలోకి లాగిన్ అయిన తర్వాత పైన కుడివైపు చివర్లో కనిపించే రౌండ్ బాక్స్‌లో ఉన్న కొశ్చన్ మార్క్‌పై క్లిక్‌చేస్తే ఓ కొత్త పేజీ ఓపెన్ అవుతుంది. అందులో ప్రొఫైల్ అండ్ పేమెంట్స్ ఆప్షన్ ఉంటుంది. దానిపై క్లిక్‌చేసి పేమెంట్స్ మెథడ్స్‌ను ఎంచుకోవాలి. అందులో మీకు యూపీఐ క్రెడిట్ లైన్ ఆప్షన్ ఉంటుంది. దాన్ని ఎంచుకొంటే మీకు క్రెడిట్ లైన్ సౌకర్యాన్ని కల్పించిన బ్యాంక్ కనిపిస్తుంది. దానిపై క్లిక్‌చేసి పిన్ నెంబర్ ద్వారా పేమెంట్స్‌ను పూర్తి చేయవచ్చు. అలాగే అమెజాన్, ఫ్లిప్‌కార్ట్, ఫోన్‌పే తదితర యాప్‌ల ద్వారా కూడా బై నౌ-పే లేటర్ సదుపాయాలు లభిస్తున్నాయి.

### గుర్తుంచుకోండి..

ఈ క్రెడిట్ లైన్ రీపేమెంట్స్.. బ్యాంకునుబట్టి ఒక్కో రకంగా ఉంటాయి. అలాగే మీ ఖాతాలో నగదు నిల్వలు లేకపోయినా రుణం ద్వారా మీ అవసరాలను యూపీఐ పేమెంట్స్‌తో చేసుకుంటున్నందున దీనికి వడ్డీ రేట్లు కూడా ఎక్కువే ఉంటాయి. ఇక అప్రమత్తంగా లేకపోతే సైబర్ మోసాలకూ తావుంటుంది.



# లాభాల స్వీకరణకు అవకాశం!

## మార్కెట్ పల్స్



**దేశీయ** స్టాక్ మార్కెట్లలో లాభాల జోష్ కనిపిస్తున్నది. ఒడిదొడుకులు చోటుచేసుకుంటున్నా స్థూలంగా మదుపరులు పెట్టుబడులకే ప్రాధాన్యతనిస్తున్నారు. అంతకుముందు వారం ముగింపుతో చూస్తే గత వారం బీఎస్ఈ ప్రధాన సూచీ సెన్సెక్స్ 623.07 పాయింట్లు లేదా 0.76 శాతం ఎగబాకి 82,133.12 వద్ద నిలిచింది. ఇక ఎన్ఎస్ఈ సూచీ నిఫ్టీ 90.50 పాయింట్లు లేదా 0.36 శాతం ఎగిసి 24,768.30 దగ్గర ముగిసింది. అయితే ఈ వారం ఈ లాభాలను మదుపరులు ఒడిసిపట్టుకోవచ్చన్న అంచనాలున్నాయి. కానీ నవంబర్‌లో ద్రవ్యోల్బణం తగ్గుముఖం పట్టడం మార్కెట్ సెంటిమెంట్‌ను బలపరుస్తున్నది. ఫలితంగా ఇన్వెస్టర్లు పెట్టుబడులకు పెద్దపీట వేసే వీలు కూడా ఉందంటున్నారు. ఇక ఈ వారం డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ కదలికలు, గ్లోబల్ స్టాక్ మార్కెట్ల తీరుతెన్నులు, ముడి చమురు ధరలు, అంతర్జాతీయ పరిణామాలు ప్రధానం. కాగా, అమ్మకాల ఒత్తిడి కనిపిస్తే నిఫ్టీకి 24,400 పాయింట్ల స్థాయి కీలకమైనదనుకోవచ్చు. దీనికి దిగువన ముగిస్తే 24,200 పాయింట్ల స్థాయిని మద్దతుగా చెప్పుకోవచ్చని అత్యధిక నిపుణుల మాట. అయితే సూచీలు పరుగందుకుంటే ఈ వారం నిఫ్టీ 25,100-25,300 స్థాయికి వెళ్లవచ్చని కూడా చెప్తున్నారు.

### గమనిక..

స్టాక్ మార్కెట్ పెట్టుబడులు రిస్క్‌తో కూడుకున్నవి. వివిధ దేశ, విదేశీ పరిణామాలు ట్రేడింగ్‌ను ఎక్కువగా ప్రభావితం చేస్తుంటాయి. కాబట్టి ఇక్కడ ఒడిదొడుకులు చాలా సహజం. పెట్టుబడులు పెట్టే ముందు ఆర్థిక నిపుణుల సలహా తీసుకోవడం, ఆయా సాధనాల డాక్యుమెంట్లను క్షుణ్ణంగా చదువుకోవడం ఉత్తమం. అలాగే పైన పేర్కొన్న సూచనలు విశ్లేషకుల అభిప్రాయం మాత్రమే. దీనికి మా పత్రిక ఎటువంటి బాధ్యత వహించదు. ఎవరి పెట్టుబడులకు వారిదే పూర్తి బాధ్యత. అవగాహన కోసమే ఈ మార్కెట్ పల్స్.